క్లుప్తంగా

వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు



ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న కోటి లింగ హరిహర మహాక్షేత్రంలోని వారాహి నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం వారాహి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు తేజశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, పలు రకాల పండ్ల రసాలతో అభిషేకాలు, మూలమంత్ర హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

వత్సవాయి: మండల కేంద్రం వత్సవాయిలో ఈనెల 30వతేదీ సోమవారం జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో వైద్యసిబ్బంది ముఖ్యంగా కంటి పరీక్షలతోపాటు మోకాళ్లు, కీళ్లు, చెవి, ముక్కు, గొంతు, బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

5న జాతీయ లోక్‌అదాలత్

నందిగామటౌన్: రాష్ట్ర న్యాయాధికార సంస్థ ఆదేశాల మేరకు జూలై ఐదో తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు 16వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు శనివారం తెలిపారు. నందిగామ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాజీపడదగిన క్రిమినల్, చెక్‌బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద క్లెయిమ్‌లతోపాటు అన్ని రకాల సివిల్ కేసులను రాజీచేసుకోవచ్చని వివరించారు. జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



నందిగామరూరల్: వాహనదారులు నిబంధనలను అతిక్రమిస్తే సహించేది లేదని ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ హెచ్చరించారు. పట్టణంలోని మధిర రోడ్డులో శనివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలను విధిగా వెంట ఉంచుకోవాలన్నారు. హెల్మెట్, వాహనాల పత్రాలు లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను గుర్తించి జరిమానా విధించారు. అనంతరం హెల్మెట్, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలతో వాహనం నడుపుతున్న వ్యక్తిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

వీరులపాడు: జుజ్జూరు గ్రామంలోని జెల్లి ఏసోబు కల్యాణ మండపంలో ఈనెల 30న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజు తెలిపారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు హాజరుకావాలని కోరారు. అన్నిశాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

జగ్గయ్యపేట అర్బన్: సీఎంఆర్‌ఎఫ్ కింద జగ్గయ్యపేట మండలం అన్నవరం గ్రామానికి చెందిన మడతపల్లి అర్జునరావుకు మంజూరైన రూ.40300 నగదు చెక్కును శనివారం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) నివాసంలో టీడీపీ సీనియర్ నాయకుడు శ్రీరాం సాయిప్రసాద్ ఈ మేరకు చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. గ్రామ నాయకుడు డోగుపర్తి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారులకు శిక్షణ

గరికపాడు(జగ్గయ్యపేట): రైతులు పంటలసాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులను అవలంభించేలా వ్యవసాయాధికారులు వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రత్నశ్రీ సూచించారు. గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో శనివారం కోఆర్డినేటర్ డాక్టర్ అచ్యుతరాజు ఆధ్వర్యంలో వ్యవసాయ, అనుబంధశాఖల అధికారుల శిక్షణ-సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ రత్నశ్రీ మాట్లాడుతూ పంటలసాగులో యాజమాన్య పద్ధతులపై అధికారులు, శాస్త్రవేత్తలు కలిసి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం ద్వారానే దిగుబడులు పెరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, అపరాలు, ఇతర యాజమాన్య పద్ధతులు, విత్తన శుద్ధి, కలుపు నివారణ, సేంద్రియ వ్యవసాయం, నీటి యాజమాన్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, డివిజన్‌లోని వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో గ్రేడింగ్ పాలన

- ప్రతిపాదనలు పంపిన అధికారులు
- స్పెషల్ గ్రేడ్ పంచాయతీగా పెనుగంచిప్రోలు



పెనుగంచిప్రోలు గ్రామం వ్యూ

పెనుగంచిప్రోలు: జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు గ్రేడ్‌లు ఇచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే మండల పరిషత్ అధికారులు ఈ మేరకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. మండలంలో మొత్తం 15 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం వీటికి గ్రేడింగ్‌లు ఇవ్వనున్నారు. గతంలో ఒకటి నుంచి ఐదు వరకు గ్రేడులు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్యను మూడుకు కుదించారు. జనాభా 10వేలు దాటి, రూ.కోటి ఆదాయం ఉన్న పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పంచాయతీగా నిర్ణయించి ఈ మేరకు గ్రేడ్‌లు ఇవ్వనున్నారు.

గ్రామాల వారీగా గ్రేడ్‌లు ఇవే...

మండలంలో ఇప్పటికే 10 వేల జనాభా దాటి, రూ.కోటి ఆదాయం ఉండి గ్రేడ్–1 పంచాయతీగా కొనసాగుతున్న పెనుగంచిప్రోలు గ్రామ పంచాయతీని స్పెషల్‌గ్రేడ్ పంచాయతీగా ప్రతిపాదించారు. 4వేల జనాభా దాటిన అనిగండ్లపాడు, నవాబుపేట గ్రామ పంచాయతీలను గ్రేడ్–1 పంచాయతీలుగా, 2నుంచి 4 వేల లోపు జనాభా ఉన్న గుమ్మడిదుర్రు, కొణకంచి, ముచ్చింతాల, ముండ్లపాడు, శనగపాడు, తోటచర్ల గ్రేడ్–2 పంచాయతీలుగా, 2వేల లోపు జనాభాగల కొళ్లికూళ్ల, లింగగూడెం, శివాపురం, సుబ్బాయిగూడెం, వెంగనాయకునిపాలెం, వెంకటాపురం గ్రేడ్–3 పంచాయతీలుగా మారనున్నాయి.

పెరగనున్న పోస్టులు...

ఆయా గ్రేడ్‌ల ఆధారంగా పంచాయతీల్లో ఉద్యోగుల సంఖ్య కూడా పెరగనుంది. పెరగనున్న పోస్టుల్లో నియమితులయ్యే ఉద్యోగులకు పంచాయతీల నుంచి జీతాలు ఇవ్వాల్సి ఉంటుంది. స్పెషల్ గ్రేడ్ పంచాయతీలకు ప్రస్తుతం ఉన్న గ్రేడ్–1 కార్యదర్శి స్థానంలో గెజిటెడ్ హోదా కలిగిన డెప్యూటీ ఎంపీడీవో అధికారిని నియమిస్తారు. జనాభా సంఖ్యకనుగుణంగా టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్, శానిటరీ మేస్త్రీ లేదా ఇన్‌స్పెక్టర్, జూనియర్ అసిస్టెంట్లు, బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, క్లాప్‌మిత్రలు ఇలా అవసరమైన సిబ్బందిని ఆయా పంచాయతీలు నియమించుకోవచ్చు. పెనుగంచిప్రోలు స్పెషల్ గ్రేడ్ పంచాయతీకి టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్, శానిటరీ మేస్త్రీ పోస్టులు కేటాయించేలా కోరుతూ ప్రతిపాదనలు పంపించారు.

జనాభా ప్రాతిపదికన గ్రేడింగ్‌లు



జనాభా ప్రాతిపదికన స్పెషల్ గ్రేడ్ పంచాయతీతో పాటు గ్రేడ్–1,2,3 పంచాయతీలు కానున్నాయి. మండలంలో పెనుగంచిప్రోలు స్పెషల్ గ్రేడ్ పంచాయతీగా మారనుంది. అవసరమైన ప్రతిపాదనలు పంపించాం. గ్రేడ్‌ల ఆధారంగా ప్రజలకు మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తాయి.

– జి శ్రీను, ఎంపీడీఓ, పెనుగంచిప్రోలు

అటకెక్కిన తాగునీటి పరీక్షలు

- పట్టించుకోని అధికారులు..
- కలుషితనీరే ప్రజలకు సరఫరా
- వర్షాల నేపథ్యంలో భయాందోళనలో ప్రజలు..



షేర్‌మహ్మద్‌పేటలో రక్షణ చర్యలు లేకపోవడంతో నాచుపట్టి అపరిశుభ్రంగా ఉన్న తాగునీటి బావి

జగ్గయ్యపేట: ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడంలో జగ్గయ్యపేట నియోజకవర్గ పాలకులు తీవ్రంగా విఫలమవుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం..పాలకుల పర్యవేక్షణలోపం కారణంగా ప్రజలకు కలుషితనీరే దిక్కవుతోంది. క్రమం తప్పకుండా తాగునీటి పరీక్షలు నిర్వహించి, వాటి ఫలితాల ఆధారంగా తుదిపరి చర్యలు తీసుకుని ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాల్సి ఉండగా, సంబంధిత అధికారులు..సిబ్బంది అసలు తాగునీటి పరీక్ష కిట్లనే వినియోగించకుండా మూలన పడేస్తుండటం ప్రజల పాలిటశాపంగా మారింది. దీంతో రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన కిట్లు మూలకు చేరి ప్రజాధనం దుర్వినియోగమవుతోంది.

తాగునీటి పరీక్షల్లో తీవ్రజాప్యం..

గ్రామాల్లో తాగునీటి పరీక్షల్లో జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు పంచాయతీలకు తాగునీటి పరీక్షా పరికరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంపిణీ చేశాయి. ఎప్పటికప్పుడు గ్రామాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకులు, చేతి పంపులు, తాగునీటి బావుల్లోనీటిని పరీక్షించి లోపాలుంటే అవసరమైన చర్యలు తీసుకోవాలన్నదే లక్ష్యం. జాతీయ గ్రామీణ తాగునీటి నాణ్యత పరిశీలన పరిరక్షణ కమిటీ ద్వారా రూ.2,500 విలువ చేసే ఫీల్డ్ టెస్ట్ కిట్టు (నీటి పరీక్షా కిట్టు) పంచాయతీలకు అందజేశారు. వీటి ద్వారా తాగునీటిలో 9 రకాల పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఈ పరీక్షలకు పంచాయతీలు ఆర్థిక సంఘ నిధుల నుంచి ఖర్చు చేయటానికి వెసులుబాటు కల్పించడం గమనార్హం.

శిక్షణ ఇచ్చినా ఉపయోగం లేదు..

నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మూడు మండలాల్లో 58 గ్రామ పంచాయతీలకు ఫీల్డ్‌టెస్ట్ కిట్లను అందజేశారు. పరీక్షలు నిర్వహించే విధానంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అన్ని గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఏఎన్‌ఎంలకు శిక్షణనిచ్చారు. అవసరాన్ని బట్టి 15 రోజులకొకసారి లేదా నెలకొకసారి రక్షిత మంచినీటి పథకాల వద్ద నీటి పరీక్షలు చేయించి లోపాలుంటే నివారణ చర్యలు చేపట్టాలి. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఈ పరీక్షలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. కాని నియోజకవర్గంలోని అధిక పంచాయతీల్లో ఈ ఫీల్డ్‌టెస్ట్ కిట్లను ఉపయోగిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు.

పరీక్షించని నీరే సరఫరా..

నియోజకవర్గంలోని అత్యధిక గ్రామాల్లో ప్రజలకు కలుషిత నీరు సరఫరా అవుతోంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో గ్రామాల్లోని నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. ఇక ఓవర్ హెడ్ ట్యాంకులను సైతం మొక్కుబడిగా శుభ్రం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. జగ్గయ్యపేట మండలంలోని బలుసుపాడు, బూదవాడ, మల్కాపురం, రామచంద్రునిపేట, షేర్‌మహ్మద్‌పేట గ్రామాలలో వర్షాకాలం వచ్చిందంటే రంగు మారిన నీటినే సరఫరా చేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మంచినీటి బావి చెరువు పక్కనే ఉండటంతో నీరు కలుషితమై గతేడాది షేర్‌మహ్మద్‌పేటలో డయేరియా ప్రబలిన ఘటనను ప్రజలు గుర్తుచేసుకుని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికీ షేర్‌మహ్మద్‌పేటలోని బావి నీరు కలుషితం కాకుండా అధికారులు రక్షణ చర్యలు తీసుకునే చూడటంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యారనే విమర్శలు గ్రామస్తుల నుంచి వినిపిస్తున్నాయి.

కలుషితనీరే సరఫరా చేస్తున్నారు..



గ్రామంలో ప్రజలకు సరఫరా చేస్తున్న నీరు పరిశుభ్రంగా ఉండటం లేదు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేస్తున్నారో లేదో కూడా తెలియడం లేదు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున నీరు కలుషితమయ్యే అవకాశం అధికంగా ఉంది. అధికారులు స్పందించి శుద్ధిచేసిన నీటినే సరఫరా చేయాలి.

– రమేష్, గండ్రాయి

చర్యలు తీసుకుంటాం..

అన్ని గ్రామాలలో నీటి పరీక్షా కిట్లు అందుబాటులో ఉన్నాయి. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు నీటి పరీక్షలు చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండటంతో పరీక్షలు చేయకుండా తాగునీటిని సరఫరా చేస్తే సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– స్వామినాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

సమన్వయలోపమే కారణం..

నియోజకవర్గంలోని ఆయా పంచాయతీ కార్యాలయాలకు కేటాయించిన నీటిపరీక్ష కిట్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. కొన్ని పంచాయతీల్లో మాత్రం సర్పంచ్‌లు నీటి పరీక్షా కిట్ల గురించి అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్తునప్పటికీ... అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, శిక్షణ పొందిన వారి మధ్య సమన్వయం లేకపోవడంతో ఆయా కిట్లను వినియోగించడం లేదు. ఇకనైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామపంచాయతీలకు కేటాయించిన



నీటిపరీక్ష కిట్

నీటిపరీక్షా కిట్ల ద్వారా ఎప్పటికప్పుడు గ్రామాల్లో నీటిపరీక్షలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జాతీయస్థాయి తెలుగు షార్ట్ ఫిల్మ్ పోటీలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని సెప్టెంబరు 21వ తేదీన తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో జాతీయ స్థాయి తెలుగు షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కె.ఎస్.ఎస్.ప్రసాద్ తెలిపారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రైవేట్ పాటల వీడియోల పోటీలు, రీల్స్ పోటీలు జరుగుతాయన్నారు. షార్ట్ ఫిల్మ్ పోటీల విజేతలకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.7వేలు, మూడో బహుమతి రూ.5వేలు, ప్రైవేట్ పాటల వీడియోల పోటీల విజేతలకు మొదటి బహుమతి రూ.5వేలు, రెండో బహుమతి రూ.3వేలు, మూడో బహుమతి రూ.2వేలు, అలాగే రీల్స్ పోటీలలో మొదటి బహుమతి రూ.3వేలు, రెండో బహుమతి రూ.2వేలు, మూడో బహుమతి వెయ్యి రూపాయలుగా నిర్ణయించడం జరిగిందన్నారు. సెప్టెంబర్ 5వ తేదీ లోగా షార్ట్ ఫిల్మ్ గాని, ప్రైవేట్ పాటల వీడియో గాని, రీల్స్ గాని పంపాలని కోరారు. ఈ సమావేశంలో షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డీవీ రాజు, ఉపాధ్యక్షుడు డాక్టర్ అశోక్ ఆనంద్ కొప్పుల, వర్కింగ్ సెక్రటరీ బి.అశోక్, కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందాలి

కొనసాగుతున్న రథయాత్ర ఉత్సవాలు



గుండిచ మందిరంలో ప్రవచిస్తున్న రేవతి రామన్ ప్రభుజి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇస్కాన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. రెండవ రోజు శనివారం సీతమ్మవారి పాదాల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గుండిచ మందిరంలో ఉదయం బ్రహ్మముహూర్తంలో మంగళ హారతితో మొదలయ్యాయి. అనంతరం భగవంతునికి అద్భుత అలంకరణ, ప్రభుపాద గురు పూజ నిర్వహించిన తరువాత ఇస్కాన్ జీబీసీ శ్రీమాన్ రేవతి రామన్ ప్రభుజి శ్రీమద్భాగవత ప్రవచనం చేశారు. జగన్నాథుని మహాప్రసాదాన్ని ఏ భావంతో స్వీకరించాలి, తద్వారా భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యం ఎలా పెంపొందుతుంది వంటి విషయాలను సరళమైన భాషలో వివరించారు. మధ్యాహ్న హారతి, హరినామ సంకీర్తనలు జరిగాయి. సాయంత్రం కూచిపూడి నాట్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి. ముఖ్యంగా పండాల్ తరహాలో స్వామివారి రథం చుట్టూ 108 సార్లు తిరుగుతూ హరేకృష్ణ మంత్రం జపించారు. కాగా కోస్టల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్ సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

జాబ్‌మేళాకు 300 మంది హాజరు



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

జగ్గయ్యపేట అర్బన్: స్కిల్ హబ్ తరఫున స్థానిక అమ్మాజీ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. 14కంపెనీలకు చెందిన హెచ్‌ఆర్ ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. ఆయా కంపెనీలు అందించే జీతాలు, సౌకర్యాలను వివరించారు. మొత్తం 150మంది అభ్యర్థులను ఎంపిక చేస్తూ ఆయా కంపెనీల ప్రతినిధులు వారికి అపాయిమెంట్ లెటర్లు అందజేశారు. కార్యక్రమంలో జేఆర్‌సీ విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పెనుగొండ రాజీవ్, డైరెక్టర్ రంగాపురం నాగేశ్వరరావు, లైఫ్ స్కిల్స్ కళాశాల ప్రిన్సిపాల్ టి.వెంకటేశ్వరరాజు, జేఆర్‌సీ కళాశాల ప్రిన్సిపాల్ అబ్బులు, వైస్ ప్రిన్సిపాల్ రమేష్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ రామతులసి, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల కమిటీల నియామకం

నందిగామ రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నందిగామ నియోజకవర్గంలోని నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు మండలాల పార్టీ కమిటీలను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం తెలిపింది. నందిగామ మండల పార్టీ ఉపాధ్యక్షులుగా ఇందూరి అమిరిరెడ్డి, వేల్పుల కిషోర్, ప్రధాన కార్యదర్శులుగా పిల్లి నాగేశ్వరరావు, సూరా పూర్ణచంద్రరావు, మద్దినేని లక్ష్మీనారాయణ, కోశాధికారిగా అరిగెల ఆదాము, కార్యదర్శులుగా బండి సుబ్బయ్య, రామిశెట్టి శ్రీనివాసరావు, కూచిపూడి అశోక్, పెసరమల్లి సురేష్, కొమ్ముకూరి నాగేశ్వరరావు నియమితులయ్యారు. వీరితోపాటు కార్యవర్గ సభ్యులుగా మరో 15మందిని నియమించారు.

కంచికచర్ల పట్టణ కమిటీ..

వైఎస్సార్ సీపీ కంచికచర్ల పట్టణ కమిటీ ఉపాధ్యక్షులుగా అమర్లపూడి యోహాన్, మాదుగుల మధుబాబు, ప్రధాన కార్యదర్శులుగా వేమిరెడ్డి శ్రీనివాసరావు, మురిమురి పాండురంగారావు, బుడ్డి హనుమంతరావు, కార్యదర్శులుగా తుమ్మల గోపాలకృష్ణారెడ్డి, దేవరకొండ శ్రీనివాసరావు, మహ్మద్ మీరా, మేకల కోటేశ్వరరావు, జెల్లి శివాజీ, గోగినేని వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. వీరితోపాటు 15 మంది కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు.

కంచికచర్ల మండలం..

కంచికచర్ల మండల కమిటీ ఉపాధ్యక్షులుగా వేల్పూరి ఆదియ్య, వెలగలేటి వాసు, ప్రధాన కార్యదర్శులుగా ముప్పాళ్ల శివాజీ, షేక్ సైదా, బలుసుపాటి శ్రీనివాసరావు, కార్యదర్శులుగా రాయల నరసింహారావు, అవుదొడ్డి ఉగ్రనరసింహారావు, కర్ల రామకృష్ణ, తలమాల కిషోర్, గోపిదేశి పున్నయ్య, షేక్ మొహిద్దీన్ పాషాతోపాటు కార్యవర్గసభ్యులుగా మరో 17 మందిని నియమించారు.

చందర్లపాడు మండలం..

చందర్లపాడు మండల కమిటీ ఉపాధ్యక్షులుగా వేల్పుల వెంకటేశ్వర్లు, పొల్లా జాలయ్య, ప్రధాన కార్యదర్శులుగా కొణకంచి వెంకటేశ్వరరావు, కొల్లి హనుమంతరావు, వేల్పుల రమేష్, కార్యదర్శులుగా కొరారు నాగేశ్వరరావు, తోట వీరబాబు, అనుమోలు వెంకటేశ్వర్లు, కర్ల తిరుపతిరావు, నందిగాం శ్రీను, షేక్ నాగుల్ నియమితులయ్యారు. మరో 15మంది కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెబాటే



మాట్లాడుతున్న సీఐటీయూ కార్యదర్శి గోపాల్

నందిగామరూరల్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మికులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ విమర్శించారు. స్థానిక రహదారి బంగ్లాలో శనివారం మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు నిర్వహించిన సమావేశంలో గోపాల్ మాట్లాడుతూ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగంలోని కార్మికులు ఇప్పటికే సమ్మె చేస్తున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అందించటంతోపాటు కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే జూలై 4వతేదీ తరువాత మున్సిపల్ కార్మికులు సమ్మెబాటపట్టనున్నట్లు వివరించారు. అనంతరం ఇంజినీరింగ్ విభాగం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘ నూతన అధ్యక్షునిగా పరిమి రవి, కార్యదర్శిగా శ్రావణ్‌కుమార్, కోశాధికారిగా కండెల శ్రీను, ఉపాధ్యక్షునిగా కస్తాల దాసు, సహాయ కార్యదర్శిగా దారెల్లి అశోక్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వాలంటూ కార్మికుల ఆందోళన



కంచికచర్ల ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

కంచికచర్ల: మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని తాగునీటి పైలెట్ ప్రాజెక్టులో పని చేసే కార్మికులు శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కంచికచర్ల సెక్షన్ కార్యాలయం పరిధిలోని బత్తినపాడు పైలెట్ ప్రాజెక్టు స్కీంలో పనిచేస్తున్న 11మంది కాంట్రాక్టు కార్మికులకు కాంట్రాక్టర్ మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. జీతాల గురించి అడిగితే రేపు ఇస్తా..మాపు ఇస్తా అంటూ కాంట్రాక్టర్ మభ్య పెడుతున్నాడని వాపోయారు. ఇకనైనా డింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వకపోతే పైలెట్ ప్రాజెక్టు ద్వారా సరఫరా అయ్యే తాగునీటిని గ్రామాలకు వెళ్లకుండా నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. అనంతరం నందిగామలోని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు వినతిపత్రం అందజేశారు.నిరసన ప్రదర్శనలో కార్మికులు జీవి నరసింహారావు, రాజు, ప్రభు, బోడియ్య, రామకృష్ణ, నాని, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే కమిటీపై కేసు నమోదు

జగ్గయ్యపేట అర్బన్: ఏపీయూడబ్ల్యూజే సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యులపై శనివారం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ పేరుతో ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ నాయకులు అనేక అక్రమాలు, అవినీతికి పాల్పడినట్లు స్థానిక విలేకరి ఎస్.శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ జి.రాజు తెలిపారు. యూనియన్ నిబంధనలు పాటించకుండా నిధులు స్వాహా చేయడం, ఆంధ్రప్రదేశ్ యూనియన్‌కు రావాల్సిన తెలంగాణ రాష్ట్ర ప్రెస్‌క్లబ్ వాటా రాకుండా చేయడం, దొంగ సభ్యత్వాల నమోదు, డైరీల పేరుతో నిధుల సేకరణ, జర్నలిస్టుల సంక్షేమ నిధి, జర్నలిస్టు యూనియన్ భవనాల అభివృద్ధికి నిధుల సేకరణలో పారదర్శకత లేకపోవడం, విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఎన్టీఆర్ జిల్లా జర్నలిస్టు సభ్యులను చేర్చకపోవడం వంటి అనేక అంశాలపై చేసిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారు. కోర్టులో కేసు విచారణ జరుగుతున్న సందర్భంలో గుట్టుచప్పుడు కాకుండా నూతన కమిటీ ఏర్పాటుపై కూడా న్యాయపోరాటం చేస్తామని ఫిర్యాదుదారుడు తెలిపారు.

సారె సమర్పణకు తరలివస్తున్న భక్త బృందాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఆషాఢ మాసోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజైన శనివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారికి సారెను సమర్పించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు విశేషంగా ఇంద్రకీలాద్రికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. ఉదయం 8 గంటల నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్త బృందాలు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నాయి. ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తిని దర్శించుకుని సారెను సమర్పించాయి. సారె సమర్పణకు విచ్చేసిన భక్త బృందాలకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు, తమ తోటి బృంద సభ్యులకు సారె ప్రసాదాలను అందచేస్తున్నారు. ఉదయం నుంచి ప్రారంభమైన సారె సంబరం సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగింది.

వరకట్నపు వేధింపులపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అదనపు కట్నం కోసం భర్త, అత్తమామ, ఆడపడుచులు వేధిస్తున్నారంటూ వివాహిత భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. గొల్లపూడి సత్యనారాయణ వీధికి చెందిన నూనె లీలావతికి ప్రదీప్‌తో 2024 ఫిబ్రవరిలో వివాహమైంది. ఆ సమయంలో కట్నం, ఇతర ఖర్చులు కలిపి రూ. 42 లక్షలు ఖర్చయింది. మూడు నెలల పాటు వీరి సంసారం బాగానే సాగింది. ఆ తర్వాత భర్త ప్రదీప్, అత్త పద్మావతి, నరసింహారావు, ఆడపడుచు ప్రత్యూష, ఆమె భర్త శ్రావణ్‌లు లీలావతిని వేధించసాగారు. ఆమెకు అనారోగ్యం ఉందని, పిల్లలు పుట్టరని, మందులు వాడాలంటూ ఒత్తిడి తెచ్చారు. సూటిపోటి మాటలతో వేధిస్తున్నారు. భర్త శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. వేరే సంబంధం చేసుకుంటే అదనంగా కట్నం వచ్చేదని ఆమెను ఇబ్బందులకు గురి చేశారు. ఉద్యోగ రీత్యా కొంత కాలం కిందట హైదరాబాద్ వెళ్లారు. అక్కడా అవే వేధింపులు చేయసాగారు. హైదరాబాద్ వెళుతూ ఈ ఏడాది మార్చి 2న రాయనపాడు రైల్వే స్టేషన్‌లో వదిలివేసి వెళ్లాడు. అప్పటి నుంచి లీలావతి పుట్టింట్లోనే ఉంటుంది. ఈ సమయంలో విడాకుల కావాలని కోర్టు నోటీసులు పంపాడు. భర్త, అత్తమామల వేధింపుల తాళలేక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.